తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ఏడుకొండలస్వామి పాదాలకు గాలుల నుంచి రక్షణ

-వేడుకగా ఛత్రస్థాపనం



తిరుమల.జులై 30 ప్రభాతవార్తప్రతినిధి: సాక్షాత్తు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి తిరుమలగిరిపై తొలిసారి పాదం మోపిన నారాయణగిరిపై వెలసిన శ్రీవారి పాదాలకు ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా ఛత్రస్థాపనం చేశారు. శిఖరం ఎత్తులో ఉండటంతో మరింత ఎక్కువగా గాలుల నుండి ఉపశమనం స్వామివారిపాదాలకు కల్పించేందుకు ఇక్కడ గొడుగును అమర్చుతారు.

## ప్రత్యేక అలంకారంలో నేత్రప్రధాత



నగరి, జూలై 30 ప్రభాతవార్త:

ఆడి మంగళవారం విశిష్ట పూజలను పురస్కరించుకుని టీఆర్ కండ్రిగలోని నేత్ర ప్రధాత దేశమ్మ దేవాలయంలో అమ్మవారి ప్రత్యేక అలంకారం చేశారు. ఆడి పూజలను పుర స్కరించుకుని ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అత్యధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి మొక్కులు తీర్చు కున్నారు. ఆలయం ముందున్న అమ్మవారి పాదుకల వద్ద పొంగళ్లు ఉంచి పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తు లను నియంత్రించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుని తీర్థం కళ్ళలో కల్లుకున్నారు. ఆలయం వద్ద పలువురు భక్తులు స్వచ్ఛందంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, ఈవో మునికృష్ణయ్య, ధర్మకర్తలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# ఉషోదయాన హు'షార్'

### నిప్పులు చెరుగుతూ గగనతలానికి దూసుకెళ్లిన పిఎస్ఎల్వి సి-56 రాకెట్



శ్రీహరికోట (తడ), జూలై 30 ప్రభాతవార్త

సూర్యుడు ఉదయించి కొన్ని నిమిషాలు గడిచిందో లేదో.. మరో సూర్యుడు ఉదయించినట్లుగా శ్రీహరికోట నుంచి నిప్పులు చెరుగుతూ పిఎస్ఎల్వి సి-56 రాకెట్ గగనతలానికి దూసుకెళ్లింది. అప్పటికి బాల భానుడి కిరణాలు పూర్తిగా కనుమరుగు కాలేదు. మబ్బు తెరలు కూడా అందంగా పరుచుకున్నాయి. దట్టమైన సరుగుడు చెట్ల మధ్య ఈ రాకెట్ గర్జిస్తూ ఆకాశం వైపు వెళుతున్న దృశ్యాలు ఎంతో మందిని ఆకట్టుకున్నాయి. అందమైన ఆ రాకెట్ ప్రయాణం ఆ తర్వాత ఆనందం అయ్యింది. హుషారు తెచ్చింది. శాస్త్రవేత్తల్లో రెట్టించిన ఉత్సాహం మరిన్ని రాకెట్ల తయారీకి సిద్ధమయ్యేలా చేసింది. ఆదివారం ఉదయం సరిగ్గా 6.31 గంటలకు శ్రీహరికోటలోని సతీష్‌థవన్ అంతరిక్ష కేంద్రం నుంచి శాస్త్రవేత్తలు పిఎస్ఎల్వి సి-56 రాకెట్‌ను ప్రయోగించారు. సింగపూర్ దేశానికి చెందిన అంతరిక్ష కక్ష్యలో చేరాలంటే ఉదయం పూట ఈ ప్రయోగం జరగాల్సి ఉన్న కారణంగా ఆ దేశానికి చెందిన ఏడు ఉపగ్రహాలను మన రాకెట్ ద్వారా పంపించడంతో ఈ సమయం అవసరమైంది. షార్‌లో మన శాస్త్రవేత్తలతో పాటు విదేశీ శాస్త్రవేత్తలు కూడా సందడి చేయడం కొత్తకాదు. వాణిజ్య లాభాల కోటగా మారిన శ్రీహరికోటలో ఇంకోసారి విదేశీ శాస్త్రవేత్తల కళ కనిపించింది. ఇక్కడ రాకెట్ పయనాన్ని వారు ఆసక్తిగా వీక్షించారు. ఇదిలావుంటే తెల్లవారుజామునే ఒక విధంగా చెప్పాలంటే చీకటిలోనే చిన్నపిల్లలు సైతం షార్ కేంద్రాన్ని చేరుకొని రాకెట్ ప్రయోగాన్ని వీక్షించారు. ఆదివారం సెలవురోజు కావడంతో పెద్దసంఖ్యలో పాఠశాలల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. పదివేల మందికి పైగా వీక్షకుల గ్యాలరీకి వచ్చినట్లు షార్ అధికారులు తెలిపారు. 183 బస్సులు, 350 కార్లు తెల్లవారక ముందే షార్‌ను చేరుకున్నాయి. అక్కడ వెలుగులు విరజిమ్మక ముందే షార్‌లోని విజిటర్స్ గ్యాలరీలో మాత్రం లైటింగ్ సౌకర్యం కల్పించి పిల్లలంతా క్రమశిక్షణగా కూర్చునేలా చేశారు. రాకెట్ నింగిలోకి ఎగురుతున్నప్పుడు వారి ఆనందానికి అవధుల్లేవు. చప్పట్లు, కేరింతలు కొట్టారు. ఇది సాధారణంగా జరిగే సంఘటనే అయినప్పటికీ ఆదివారం కొంచెం భిన్నంగా మరీ ఉదయం పూట ఈ రాకెట్‌ను తిలకించే అవకాశం వారికి దక్కింది. షార్‌లో ఈ ఏడాది ఇప్పటికి ఆరు ప్రయోగాలు వరుస విజయాలు సాధించగా, కనీసం మరో ఆరు ప్రయోగాలు జరపడానికి శాస్త్రవేత్తలు సంసిద్ధులయ్యారు. ఒకవైపు చంద్రయాన్ విజయాన్ని ఆస్వాదిస్తూనే మరోవైపు ఈ పిఎస్ఎల్వి రాకెట్ విజయ విహారాన్ని శాస్త్రవేత్తలు ఆస్వాదించినట్లయింది.



శ్రీహరికోటలో ఆదివారం ఉషోదయ వేళ జరిగిన పిఎస్ఎల్వి సి-56 రాకెట్ ప్రయోగం సరికొత్తగా అనిపించింది. ఈ ప్రయోగాన్ని చిత్రీకరించడానికి కెమెరా కళ్లు పోటీ పడ్డాయి. అన్ని వైపుల నుంచి ఇస్రో వారి కెమెరాలు తళుక్కుమన్నాయి. కేవలం ప్రయోగ వేదిక కనపడేవి మాత్రమే కాకుండా అన్ని వైపుల నుంచి తీసిన ఫొటోలను విడుదల చేశారు. ఇక మీడియా వారు, సందర్శకులు, షార్ లోపలికి అనుమతి లేని ఉత్సాహవంతులు సైతం విభిన్న ప్రాంతాల నుంచి ఈ రాకెట్ గమనాన్ని చిత్రీకరించారు. అందులో కొన్ని ఇవి.

## గ్రామస్థాయి కార్యాలయాల్లో రికార్డులు పక్కాగా ఉండాలి

**-జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలకు పరిష్కారం చూపాలి**
**-జిల్లా ప్రత్యేకాధికారి శ్యామలరావు**



తిరుపతిరూరల్, జూలై30 ప్రభాతవార్త:

గ్రామస్థాయి కార్యాలైన సచివాలయాలు, ఆర్‌బికె, విలేజ్ హెల్త్ సెంటర్స్, అంగన్‌వాడీ కేంద్రాలలో రికార్డులు అన్‌లైన్ డేటాతో పాటు, మాన్యువల్ రికార్డులు అనుసంధానం కావాలని జిల్లా ప్రత్యేకాధికారి జె.శ్యామలరావు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం తిరుపతిరూరల్ తనపల్లి సచివాలయం, ఆర్బికేలు, విలేజ్ హెల్త్ సెంటర్స్, అంగన్‌వాడీ కేంద్రం, ఓటేరు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో నాడు-నేడు పనులు పరిశీలించి, జిల్లా కలెక్టరేట్ నందు ఎస్పీ పరమేశ్వరరెడ్డి, జె.సి. డికె బాలాజీలతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.. జిల్లా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం 1902, స్పందన వినతులు అర్థవంతమైన పరిష్కారం చూపాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా సమీక్ష నిర్వహిస్తున్నారని, పెండింగ్ లేకుండా పరిష్కారం చూపాలన్నారు.పవర్ పాయింట్ ద్వారా పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖలవారీగా పరిష్కారం, రీ ఓపెన్ అయిన వినతులు, వాటి పరిస్థితిని వివరించారు, రీ ఓపెన్ అయిన వినతులను అధికారులు, సంబంధిత వ్యక్తుల వద్దకు వెళ్లి పరిష్కార పరిస్థితిని చేయడానికి వీలు ఉంటుందా లేదా అర్థవంతమయ్యేలా వివరించి, సంతృప్తి చెందేలా చూడాలన్నారు. పంచాయతీరాజ్, పోలీసు, పౌర సరఫరాలు, విద్యుత్ శాఖలపై సమీక్ష నిర్వహించారు. జిల్లా అధికారులు తప్పనిసరి తమ శాఖలపై తరచూ సమీక్ష జరపాలన్నారు. ఎప్పటికప్పుడూ తగు సూచనలు చేసి, ల్యాప్ సరిదిద్దాలన్నారు. జిల్లాలో జగనన్న సురక్ష కార్యాక్రమ నిర్వాహణ బాగుందన్నారు. తిరుపతిరూరల్ తనపల్లి సచివాలయం పర్యటనలో ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల, అనర్హుల జాభితాను పత్యేకాధికారి పరిశీలించారు. జగనన్న సురక్షలో పరిష్కరించిన అంశాలు, అందించిన ధృవ పత్రాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది యూనిఫారంతో హాజరు కావాలని, మీ జాబ్‌కు సంబంధించి ప్రతి విషయంపై అవగాహన ఉండాలన్నారు. అందుకు సంబంధించి మాన్యువల్ రికార్డు కూడా ఉండాలని సూచించారు. గ్రామాల్లో త్రాగునీటి పరిస్థితి, వాటర్ ట్యాంక్‌ల క్లినింగ్‌పై అడిగి తెలుసుకున్నారు. ఆర్బికే పర్యటనలో కియోస్క్ పనితీరు, రైతులకు ఇస్తున్న సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, మందులు అన్‌లైన్ రికార్డులు మేరకు మాన్యువల్ రికార్డుల్లో నమోదు ఉండాలని, తేడా ఉందని, రికార్డులు పక్కాగా ఉండాలన్నారు. మరోసారి తనిఖీలో రికార్డులు పక్కాగా ఉండేలా చూడాలని వ్యవసాధికారి ప్రసాదరావుకి సూచించారు. విలేజ్ హెల్త్ సెంటర్ పర్యటనలో అందుబాటులో ఉన్న మందులు, వైద్య సేవలు, టెలీ మెడిసిన్ 14416 అందిన రోజువారీ కాల్స్ రికార్డ్సు, వారికిచ్చే వైద్య సలహాలు, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, అందుతున్న బాలామృతం, గర్భిణీలకు అందిస్తున్న పౌష్టిక ఆహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులు, పాత మరుగు దొడ్లు, ప్రస్తుతం నిర్మిస్తున్న మరుగుదొడ్లు పరిశీలించారు. 260 మంది పిల్లలు చదువుతున్నారని, 16 మంది డ్రాప్ అవుట్స్ ఉన్నారని తెలియజేసారు. డ్రాప్ ఔట్స్‌ను కూడా బడికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు కనక నరసారెడ్డి, కిరణ్‌కుమార్, రామారావు, చంద్రముని, ఎంపిడిఓ వెంకటనారాయణ, డీఎల్ డిఓలు సుశీలాదేవి, ఆదిశేషారెడ్డి, డిపిఓ రాజశేఖర్‌రెడ్డి, ఐసిడిఎస్ పిడి జయలక్ష్మీ, డిపిఎం డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ నీలిమా, డాక్టర్ ఉష, ఉప మండలాధ్యక్షుడు విడుదల మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి టిక్కెట్ కోసం నేతల క్యూ!

**-అభ్యర్థులెవరని తేల్చని అధిష్ఠానం**
**-అయోమయంలో ఆశావహులు**



ప్రభాతవార్త-తిరుపతి:

తెలుగుదేశంపార్టీ అధిష్టానం దృష్టిలో తాము ఎన్నికలకు పోటీలో ఉన్నామని ప్రకటించుకునేందుకు పలువురు తెలుగుతమ్ముళ్ళు పోటీపడుతున్నారు. ఎన్నికలకు తక్కువసమయం ఉండటంతో ప్రధాన నియోజకవర్గాల్లో తమకంటే తమకే టిక్కెట్లు ఖరారు చేశారని కొందరు నేతలు, మరికొందరు ఇంకా తమకు టిక్కెట్ ఇస్తారని నేతలు కాలర్‌ఎగరేసుకుని ఎవరికి వారే అభ్యర్థులమని ప్రకటించుకుంటుండటం పార్టీ శ్రేణుల్లోనేగాక జనాన్ని అయోమయానికి గురిచేస్తున్నారు. గతకొంతకాలంగా అభ్యర్థులు ఎవరనేది తేల్చలేకపోతుండటం...తామే పోటీచేస్తున్నామనే ప్రకటనలతో ఓటర్లను విస్మయానికి గురిచేసేలా ఉంది. తెలుగుదేశం అధినేత చంద్రబాబు తన సొంత తిరుపతి జిల్లాతో బాటు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరుజిల్లాలో అన్ని చోట్లా ఎవరికి టిక్కెట్లు ఇస్తామనేది ప్రకటన రాలేదు. నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలను క్షేత్రస్థాయిలో గట్టిగా పనిచేయాలని ,ప్రజలతో కలసి వారి సమస్యలపై పోరాటం చేయాలని, అదికార పార్టీనేతల తీరుపై గట్టిగా ప్రశ్నించాలని నిర్ధేశం చేస్తున్నారు. ఈ దఫా అభ్యర్థుల ఎంపికలో నిక్కచ్చిగా వ్యవహరిస్తానని, మాటవరుసకో, కుటుంబంలో వారికో, గత ఎన్నికల్లో ఓడిపోయిన వారికి, మొహదాక్షిణ్యంతో టిక్కెట్టివ్వబోమని బాబు తేల్చిచెప్పేశారు. పార్టీకోసం పనిచేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందని, ప్రజల అభిప్రాయం మేరకు ఎన్నికల్లో గెలిచే వారికి, పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ప్రధానమని చెబుతున్నారు. సరిగ్గా ఏడునెలల క్రిందట ఉమ్మడి చిత్తూరుజిల్లాతోబాటు నూతనంగా ఏర్పడిన తిరుపతి జిల్లాలోని అనేక నియోజకవర్గాల్లో యుతనేత నారాలోకేశ్ పాదయాత్ర చేపట్టిన విషయం విదితమే. అప్పట్లో యువనేతతో కలసి కొందరు ఇన్‌ఛార్జిలు పాదయాత్ర చేశారు. జనంలో జోష్‌నింపేందుకు లోకేశ్ ఆయా చోట్ల వారిచేయిపట్టుకుని నడిచారు.ఇప్పుడు వారంతా టిక్కెట్లు తమకేనంటూ ఊహల్లోనే ప్రచారం మొదలుపెట్టారు. కానీ ఇప్పటికిప్పుడు ఉన్న పరిస్థితుల్లో 2024లో అధికారంలోకి రావడమే ధ్యేయంగా చంద్రబాబు వ్యూహరచన చేసుకుని పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. చిత్తూరుజిల్లాలో ఇప్పటికే కుప్పం నుండి చంద్రబాబు, పలమనేరు మాజీమంత్రి అమరనాథరెడ్డి,చిత్తూరు నుంచి ఏఎస్ మనోహర్ పేర్లు సూచాయప్రాయంగా ఖరారుచేసినట్లు తెలుస్తోంది. మిగిలిన నియోజకవర్గాల్లో అభ్యర్థులెవరని పార్టీ ఇప్పటివరకు అధికారికంగా ప్రకటనచేయకపోవడం, ఖరారు కూడా కాలేదనేది పార్టీ సీనియర్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి నుండి ముగ్గురు నేతలు, చంద్రగిరి నుండి ఇద్దరు బలమైన నాయకులు, చిత్తూరు నుండి ఇద్దరు నేతలు, శ్రీకాళహస్తి నుండి ఇద్దరు నేతలు, నగరి నుండి ఇద్దరు నేతలు, సత్యవేడు నుంచి ఇద్దరు నేతలు, పూతలపట్టునుండి ఇద్దరు నేతలు, గూడూరు,జిడినెల్లూరు పోటీపడుతున్నారు. అయితే వీరిలో ఎవరికి టిక్కెట్లు ఖరారవుతాయనేది ప్రకటన వెలువడే వరకు ఉత్కంఠతే.

## రాహుకేతు పూజలు జరిపించుకున్న యు.పి మంత్రి



శ్రీకాళహస్తి,జూలై 30 ప్రభాతవార్త

దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న రాహుకేతుదోష నివారణ పూజలకు భక్తుల నుంచే కాకుండా అతిదుల తాకిడి కూడా పెరిగింది.ఈ నేపధ్యంలో ఉత్తరప్రదేశ్‌కుచెందిన మంత్రి సురేష్‌రాహి కుటుంబసభ్యులతో వచ్చారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ఇఓ ప్రోటోకాల్ మేరకు దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికారు. ఆయన ఇక్కడ నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరారు. దాంతోఎఇఓ సతీష్‌మాలిక్ వెంటనే ప్రత్యేక రాహుకేతుదోష నివారణ పూజల మండపం వద్ద ఏర్పాట్లు చేసారు. పూజల అనంతరం వారికి అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు.

## చెట్టును ఢీకొట్టిన లారీ



నారాయణవనం, జూలై 30 ప్రభాతవార్త :

పుత్తూరు-చెన్నై జాతీయ రహదారిలోని నారాయణవనం మండలం స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని సముదాయం జంక్షన్ వద్ద ఆదివారం తెల్లవారుజామున నిద్రమత్తులో డ్రైవర్ లారీని నడపడంతో చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లారీ ముందర భాగం నుజ్జు కావడంతో పాటు బోల్తా కొట్టింది. లారీలోని వ్యక్తులకు ఎవ్వరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. చెన్నై నుంచి కడప వైపుగా వెలుతున్న తరుణంలో ఈ ప్రమాదం జరిగింది. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఇసుక రీచ్ మూసేంత వరకు "ఆమరణ నిరాహార దీక్ష"

**ముమ్మాటికీ ఇది ప్రభుత్వ హత్యే..కోటి పరిహారం చెల్లించాలి..!**
**బాధ్యులైన ప్రతి అధికారిని సస్పెండ్ చేయాల్సిందే..!**
**ఇసుక రీచ్‌లో నీట మునిగి మెడికల్ విద్యార్థి మృతి**
**టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని**





చంద్రగిరి, జూలై 30 ప్రభాతవార్త:

నాగయ్యగారిపల్లి వద్ద గల ఇసుక రీచ్‌ను మూసేంత వరకు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని ప్రకటించారు. కర్నూలు జిల్లా, డోన్‌కు చెందిన కార్తీక్ ఇక్కడి వెంటకపద్మావతీ కళాశాలలో ఫిజియోథెరపీ సెకండ్ ఇయ్యర్ చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో నాగయ్యగారిపల్లి వద్ద గల రీచ్ వద్దకు ఈతకు వెళ్ళి నీట మునిగి ప్రాణాలో కోల్పోయాడు. సమాచారం అందుకున్న ఆయన గ్రామస్థులు, పార్టీ నాయకులతో కలసి రీచ్ వద్దకు వెళ్ళి అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్తీక్ మృతి ముమ్మాటికీ ప్రభుత్వం చేసిన హత్యగా అభివర్ణించారు. ఇందుకు ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, అధికారులు, పోలీసులు బాధ్యత వహించాలన్నారు.ఇసుక అక్రమ రవాణాపై గత పది రోజుల క్రితం గ్రామస్థులతో కలసి టిడిపి దాదాపు ఆందోళన చేయగా పోలీసులు 24 మందిపై కేసులు నమోదు చేసినట్లు ధ్వజమెత్తారు. ఆ క్రమంలో ఇద్దరు యువకులను ఎస్ఐ వంశీధర్ బలవంతంగా తీసుకెళ్ళి ఏ విధంగా చిత్రహింసలకు గురి చేశారో మీకందరికీ తెలిసిందే అన్నారు. ఈ ప్రాంత రైతులు ఇసుకను తవ్వితీయవద్దని వేడుకున్నా కనికరించలేదన్నారు. ఇసుకను పెద్దఎత్తున తవ్వితీయడంతో ప్రాణాపాయం పొంచివున్నట్లు ఆందోళన వ్యక్తం చేయడం జరిగిందన్నారు. అయినప్పటికీ ఎంఎల్‌ఏ ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు నడుమ ఇసుక యధేచ్ఛగా అక్రమ రవాణా చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇసుక అక్రమార్కుల దుర్మార్గానికి కర్నూలు నుండి తన ఉజ్వల భవిష్యత్తుకై ఇక్కడికి వచ్చిన విద్యార్థి నదిలో ప్రాణాలు పోగొట్టుకోవడం దారుణమన్నారు. సహజంగా పోలీసులు సమాచారం వచ్చిన చాలాసేపటికి గానీ రారనీ, అయితే ఇక్కడ విద్యార్థి మృతి బయటిక పొక్కనీయక అడ్డదారిలో తిరుపతి రుయాకు తరలించడం జరిగిందన్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న వారికి చెవిరెడ్డి ఏవిధంగా వత్తాసు పలుకుతున్నారో ప్రజలు గమనించాలన్నారు. మరింత మంది ప్రాణాలు పోగొట్టుకూడదనే ఆవేదనతో సోమవారం ఉదయం 10 గంటలకు చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటున్నట్లు తెలిపారు. ఇసుక రీచ్‌ను మూసేంత వరకు తమ ఆమరణ దీక్ష ఆగదన్నారు. ఇసుక తరలించుకుపోవడంలో సహకరించిన ప్రతి అధికారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఇసుక రీచ్ మూసివేత :తహశీల్దార్



రామిరెడ్డిపల్లి పంచాయతీ, నాగయ్యగారిపల్లి వద్ద గల స్వర్ణముఖీ నదిలో ఏర్పాటు చేసిన రీచ్ మూసివేతకు తహశీల్దార్ శిరీషా ఆదివారం ఆదేశాలు ఇచ్చారు. ఆది వారం ఈతకు వెళ్ళిన మెడికల్ విద్యార్థి మృతి చెందడంపై ఆమె తీవ్రంగా స్పందించారు. తరచూ వివాదాలకు కారణ మవుతున్న ఇసుక రీచ్‌పై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇసుక రీచ్ ను మూసివేయాలని రెవెన్యూ యంత్రాంగాన్ని, పోలీసులను స్పష్టంగా ఆదేశారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఆమె సిఐ రాజ శేఖర్, రెవెన్యూ అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థి మృతి, ఇసుక అక్రమ రవాణాపై సమీక్షించారు. పరిస్థితి తీవ్రత దృష్ట్యా వెంటనే రీచ్‌ను మూసివేయాలనీ, ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి సైతం వెనుకాడబోమని తేల్చిచెప్పారు.

సమావేశంలో డిటిలు మోహన్‌రెడ్డి, అమృత, ఎంఆర్ఐ సులోచన, విఆర్ఓలు విజయ్‌కుమార్, నాగరాజు, మునస్వామి, వెంకటేశులు, నిశాంత్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర భవితకు చంద్రబాబు గ్యారెంటీ

**- తెదేపా పరిశీలకుడు ఖాదర్ బాషా**
**- అన్ని వర్గాలను మోసం చేసిన సిఎం జగన్‌రెడ్డి**

కుప్పం, జూలై 30 ప్రభాతవార్త

రాష్ట్ర భవిష్యత్తుకు తెదేపా అధినేత చంద్రబాబునాయుడు గ్యారంటీగా నిలుస్తారని కుప్పం తెదేపా పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. ఆదివారం మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన మల్లానూరు, వెండుగంపల్లి పంచాయతీల్లో తెదేపా క్లస్టర్, బూత్ ఇన్‌చార్జీల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలను సిఎం జగన్‌రెడ్డి మోసం చేశారన్నారు. సిఎం జగన్‌రెడ్డిని కుటుంబసభ్యులే నమ్మడం లేదని ఆరోపించారు. వైకాపా నేతలకు రాష్ట్రం వదిలివెళ్లే



పరిస్థితులు దగ్గరపడ్డాయన్నారు. వైకాపా పాలనలో అభివృద్ధికి అడ్రస్ లేకుండా పోయిందని వచ్చే ఎన్నికల్లో ప్రజలు తెదేపాకు పట్టం కట్టడం ఖాయమన్నారు. తెదేపా మేనిఫెస్టో చూసి వైకాపా ప్రభుత్వంకు భయంపుట్టుకొచ్చిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, ప్రాజెక్టులపై దృష్టి పెట్టక కేవలం బటన్ నొక్కితే సరిపోదన్నారు. అన్ని సరుకులు, వస్తువులపై ధరలు పెంచేశారన్నారు. రాష్ట్రంలో 720మందిపై అక్రమ కేసులు బనాయించారన్నారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు రామచంద్ర, మహేంద్ర, సంజీవరాజులునాయుడు, మోహన్, శివకుమార్, రమేష్, బాలాజీ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ ద్రోహి జగన్‌రెడ్డి ......డాక్టర్ థామస్

కార్వేటినగరం,జూలై 30 ప్రభాతవార్త:



రాయలసీమ ద్రోహి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని జి.డి.నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి,ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ అన్నారు. కార్వేటినగరం మండలం కృష్ణాపురం జలాశయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. డాక్టర్ థామస్ మాట్లాడుతూ గతంలో 33కోట్ల జైకా నిధులు వస్తే వైకాపా ప్రభుత్వం అభివృద్ధి చేయలేక చేతులెత్తేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పర్యాటకులు ఇతర రాష్ట్రాల ప్రజలు జలాశయాన్ని తిలకించడానికి వేలాదిమంది తరలి వచ్చేవారన్నారు. ఈ వైకాపా ప్రభుత్వం వచ్చిన తరువాత జలాశయాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. ఈ నాలుగు సంవత్సరంలో డిప్యూటీ సిఎం. నారాయణస్వామి ఉన్న జలాశయాన్ని అభివృద్ధి చేయలేక పోగా,నిధులు దండుకోవడానికి నూతన ప్రాజెక్టు ఏర్పాటుకు మొగ్గు చూపిస్తున్నారన్నారు. కనీసం కృష్ణాపురం ప్రాజెక్టు అని బోర్డు కూగా ఏర్పాటు చేయలేని దుస్థితిలో ప్రస్తుత పాలకులు వున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. డ్యాం అభివృద్ధి ఎక్కడ స్వామి అంటూ సెల్ఫిచాలంజ్ చేశారు. జలాశయం ద్వారా 22పంచాయితీలకు నీళ్ళు అందించడమే కాకుండా పక్క మండలమైనా ఎస్.ఆర్.పురంకు కూడా జలాలు అందించ వచ్చన్నారు. రిజర్వాయర్ కుడి,ఎడమ కాలువలు పూడిపోవడమే కాకుండా కబ్జాకు కూడా గురియ్యిందన్నారు. విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షులు చెంగల్‌రాయల్‌యాదవ్,గుండయ్య,నాగరాజు,బీగాల రమేష్,దాము,సందాని,ఈశ్వర్,మురళి,వాసుదేవరెడ్డి,ధనశేఖర్‌వర్మ,అన్నామలై,కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు.

## సాయిబాబా వార్షికోత్సవం

శ్రీకాళహస్తి,జూలై 30 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని శ్రీరామనగర్‌కాలనీలో వెలసిన సాయిబాబా మందిరంలో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం భారీ ఎత్తున సంబరాలు జరిపారు.కార్యక్రమాలను విద్యాజ్యోతి పాఠశాల కరస్పాండెంట్ ప్రవీణ్‌రెడ్డి సారధ్యంలో నిర్వహించారు. ఉదయం నుంచి బాబా సన్నిధిలో సామాజిక కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక చింతన ఏర్పాటు చేసారు.రాత్రి భారీ ఎత్తున బాబా చిత్రపటాలను ఊరేగింపు జరిపారు.మేళ తాళాలు తప్పెట్ల మోతతో ఊరేగింపు నాలుగుమాడావీధుల్లో సాగింది. ర్యాలిలో ప్రముఖులు పాల్గొన్నారు. మహిళలు విశేష సంఖ్యలో హాజరయ్యారు.

## లయన్స్‌క్లబ్.. కెసి హాస్పిటల్‌చే ఉచిత దంతవైద్య శిబిరం

గుడుపల్లె, జూలై 30 ప్రభాతవార్త



కుప్పం లయన్స్ క్లబ్, కెసి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిచే ఆదివారం కస్తూరిబా గురుకులంలో విద్యార్థినులకు ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. అలాగే నటుడు సోనుసూద్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోనల్ అధ్యక్షుడు డా॥ మహేష్, కుప్పం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యేంద్రశేఖర్, ప్రసాద్, పిజి సెల్వం, లెనిన్, సుబ్బు, మణి, సతీష్, నరసింహ, హెచ్ఎం సోమశేఖర్ పాల్గొన్నారు.

## యోగసాధన ద్వారా ఎన్నో రోగాలను నివారించుకోవచ్చు:

శ్రీకాళహస్తి,జూలై 30 ప్రభాతవార్త



నేడు సమాజంలో ప్రతి చిన్న ఆనారోగ్యానికి డాక్టర్లు, అసుపత్రులను సంప్రదించటానికి అలవాటు పడ్డామని యోగా గురువు సి.మార్కండేయులు అన్నారు.ఆదివారం శుకబ్రహ్మాశ్రమంలోని యోగా నిలయంలో 'సాధన కార్యక్రమాలను' ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా సాధకులకు గురువు దిశ దెశ నిర్దేశం చేసారు.ఇక్కడ నిర్వహిస్తున్న యోగా కార్యక్రమాలకు పట్టణం నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి కూడా సాధకులు హాజరౌతున్నారు.ఆదివారం వామన దౌతి(గజకర్ణి) కార్యక్రమాలను యోగ గురువు సి.మార్కండేయులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన సూచనలు చేస్తూ గోరు వెచ్చని నీటిలో తగిన మోతాదులో సైంధవ లవణం కలిపి ఆ నీటిని పొట్టనిండా తాగి వెంటనే నీటి ద్వారా వామనం చేసుకోవటం,ఈ ప్రక్రియ వలన సైనస్,ఊబకాయం ఉన్న వారికి ఉపశనం కల్గుతుందని వివరించారు.ఈ ప్రక్రియను వారం వారం చేసుకుంటే ఎంతో మంచిదని మార్కండేయులు వివరించారు.ప్రజల ఆరోగ్యానికి సంబంధించి ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి యోగా శిక్షణను ఏర్పాటు చేసారని తెలిపారు. ఓ వైపు యోగ మరో వైపు గిరిజన కాలనీల్లో చిన్నారులకు అక్షరాలు నేర్పటమే కాకుండా చూపు కొల్పొయిన వారికి చూపు ప్రసాదిస్తున్నారని వివరించారు.ప్రతినిత్యం శుకబ్రహ్మాశ్రమంలో ఉచిత యోగా శిక్షణలు జరుగుతున్నాయని సుమారు ప్రతి నిత్యం 40మంది శిక్షణ పొందుతున్నారని ఎవరైనా ఉచిత యోగా శిక్షణలో పాల్గొనాలని వివరించారు.యోగా సాదకులకు భోజన,బస వసతి కల్పించారని మార్కండేయులు వివరించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఉచిత కంటి ఆపరేషన్లకు 58మంది ఎంపిక

కుప్పం, జూలై 30 ప్రభాతవార్త



సాయిమాతా సేవా ట్రస్ట్, బెంగళూరు శారద కంటి ఆస్పత్రిచే కుప్పంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. మొత్తం 180మంది శిబిరంకు హాజరు కాగా వారికి కంటి పరీక్షలు నిర్వహించారు. 58మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో శివ, డా॥ నిరంజన్, ట్రస్ట్ వ్యవస్థాపకుడు డిఎన్ జగదీష్‌బాబు పాల్గొన్నారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

కుప్పంరూరల్, జూలై 30 ప్రభాతవార్త



మండలంలోని కొత్తపల్లి గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల భావాలను వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కృష్ణ, నాగరాజు, శరవణ, కృష్ణారెడ్డి, శివకృష్ణ, దేవరాజు, వెంకటేష్, మంజునాథశెట్టి, ఇందిర, జలజాక్షి, వాణి, తిమ్మక్క, వెంకటలక్ష్మి, బిందుశ్రీ, యశస్విని పాల్గొన్నారు.

## మహిళలకు అండగా మహాశక్తి పథకం

కుప్పంరూరల్, జూలై 30 ప్రభాతవార్త



తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన మహాశక్తి పథకం మహిళలకు అండగా నిలుస్తుందని 22వ వార్డు కౌన్సిలర్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం పైబాట, గుడుపల్లె రోడ్‌లో మహాశక్తి పథకం ప్రచారాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సుసౌకర్యం, ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచిత పంపిణీ, అమ్మకు వందనం పేరిట చదివే పిల్లలు ఒక్కొక్కరికి 15వేలు, 18-50 ఏళ్ల మహిళలకు ప్రతినెలా రెండువేల సాయం అందించడం జరుగుతుందన్నారు. మహిళలు చంద్రబాబును, తెలుగుదేశం పార్టీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా నేతలు శారదమ్మ, తిరుమగళ్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ప్రభుత్వ భూమి ఆక్రమణ

ఆక్రమణ పై స్పందించని రెవెన్యూ అధికారి

ఓజిలి, జులై 30, ప్రభాతవార్త



ఓజిలి మండలంలోని గుర్రంకొండ గ్రామంలో సర్వే నెంబర్ 63లో ప్రభుత్వ పోరంబోకు భూమిని అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి సుమారుగా మూడు ఎకరాల వరకు ఆక్రమించుకుని జామాయిల్ సాగు చేస్తున్నాడు. దీనిపై స్థానికులు అనేకమార్లు గతంలో తహాశీల్దార్‌కు ఫిర్యాదు చేసిన చర్యలు చేపట్టకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గుర్రంకొండ సర్పంచ్ ముప్పాళ్ళ మాధవిలత, ప్రభుత్వ భూమి అన్యకాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసిన రెవెన్యూ యంత్రాంగం నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరించడం పట్ల స్థానిక గ్రామ ప్రజలు రెవెన్యూ అధికారులపై మండిపడుతున్నారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని వెంటనే రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని గ్రామ ప్రజలు రెవెన్యూ అధికారులను వేడుకుంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూములు కబ్జాలకు గురి కాకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## ఆగి ఉన్న లారీ ఢీకొని వ్యక్తి మృతి

పుత్తూరురూరల్, జూలై 30 ప్రభాతవార్త:



ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహన చోదకుడు ఢీకొనడంతో తీవ్రగాయాలై, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం జరిగింది. స్థానికుల కథనం మేరకు... పుత్తూరు మండలం పరమేశ్వరమంగళంపంచాయతీ పరిధిలోని వేపగుంట క్రాస్ రోడ్డు వద్ద కోలార్ అట్టల ఫ్యాక్టరీలో మహా రాష్ట్రంలోని ఔరంగాబాద్‌కు చెందిన రామచంద్రతోటే(57), సమీర్ బాషా ఇద్దరు శనివారం రాత్రి విధులు ముగించుకుని పుత్తూరుకు ద్విచక్రవాహనంపై వస్తుండగా స్థానిక వేపగుంట క్రాస్ సమీపంలో తిరుపతి-చెన్నై జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ సంఘటనలో రామచంద్రతోటేకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెనుక కూర్చున్న సమీర్‌బాషా క్షేమంగా బయటపడ్డాడు. దీంతో పుత్తూరు ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించి తిరుపతిలోని అమర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం వేకువ జామున మృతి చెందాడు. ఈ మేరకు పుత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన గాలి భానుప్రకాష్

నగరి, జూలై 30 ప్రభాతవార్త:



నగరి రూరల్ మండలం గుండ్రాజు కుప్పం డీబ్ల్యుకు చెందిన రవి తండ్రి, సీనియర్ నాయకుడు ఏసు మృతదేహాన్ని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తించి మంచి నాయకుడిని కోల్పోయామని ఆయన గుర్తు చేశారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

# వైసీపీ నాయకుల జేబులు నింపేలా జగనన్న కాలనీలు

**- ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్**

గూడూరు, జూలై 30 ప్రభాతవార్త

జగనన్న కాలనీల నిర్మాణం వైసీపీ నాయకుల జేబులు నింపేలా ఉందని ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ తెలిపారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలుపు మేరకు ఫెయిల్యూర్ ఆఫ్ జగనన్న కాలనీల పేరిత గత రెండురోజులుగా జగనన్న కాలనీలు సందర్శించిన అనంతరం గూడూరు జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధీనగర్ ప్రాంతంలో ఏర్పాటైన జగనన్న కాలనీలో వైసీపీ నాయకులే కాంట్రాక్టర్ల అవతారమెత్తి కనీస నాణ్యత ప్రమాణాలు పాటించకుండా అరకొర నిర్మాణాలు చేశారని, కేటాయించిన ఇళ్లలో కనీసం పదిశాతం కూడా పూర్తి చేయలేని స్థాయిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. నాసిరకమైన బేస్‌మెంట్ వేయడంతో ఐరన్ రాడ్స్ అన్ని బయటకు కనిపిస్తున్నాయన్నారు.



వైసీపీ కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకే జగనన్న కాలనీలు ఉన్నాయని విమర్శించారు. నియోజకవర్గంలోని ఒక్క లేఅవుట్‌లో కూడా ఇప్పటివరకు కనీసం పునాదులు తీసిన దాఖలాలు కూడా లేవని, జగనన్న కాలనీలలో కనీస మౌలిక వసతులు కల్పించలేదని, కొన్ని గ్రామాల్లో ముంపు ప్రాంతాల్లో స్థలాలు కేటాయించడం దారుణమన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేతో పాటు పలువురు ఎంఎల్‌సీలు, రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్లు ఉన్నారని, జగన్‌రెడ్డి నవరత్నాల్లో ఒకటైన పక్కాగృహాలు పేదలకు కట్టిచ్చేలా పేదల పక్షాన ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణ అధ్యక్షులు ఇంద్రవర్ధన్, కార్యదర్శులు అవినాష్, శివకుమార్‌లు మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం పాలసీల గురించి మాట్లాడితే వైసీపీ మంత్రులు పవన్ కల్యాణ్ పెళ్లిళ్లపై మాట్లాడటం సిగ్గుచేటన్నారు. మంత్రులు, నాయకులు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, వైసీపీ నాయకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇళ్ల నిర్మాణం చేసి లబ్ధిదారులకు అందజేయాలని హితవు పలికారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు శంకర్, శ్రీనాథ్, సాయి, ప్రసాద్ పాల్గొన్నారు.

## తెదేపా సీనియర్ నాయకుడికి పరామర్శ

తొట్టంబేడు, జూలై 30 ప్రభాతవార్త



మండలంలోని శేషమనాయుడుకండ్రిగ పంచాయతీ అరుంధతీవాడకు చెందిన గంగాధరం శ్రీకాళహస్తికి వెళ్తుండగా కామిహరిజనవాడ వద్ద మోటార్‌సైకిల్‌ను బస్సు డీకొనగా కిందపడి కాలువిరిగిపోవడంతో తిరుపతిలోని ఎలైట్ ఆస్పత్రి నందు చికిత్స పొంది స్వగ్రామం అయిన శేషమనాయుడుకండ్రిగకు చేరుకోవడంతో విషయం తెలుసుకున్న బొజ్జలబృందమ్మ పరామర్శించారు. సత్వరం కోలుకుని రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ విజయానికి కృషిచేయాలని సుధీర్‌బాబును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, పాలసొసైటీ మాజీ ఛైర్మన్ రావిళ్ళమునిరాజనాయుడు, మహిళా నాయకురాలు మల్లీశ్వరి, ఉపసర్పంచ్ రాజేష్, వార్డు సభ్యురాలు పరశురాం, మాజీ సర్పంచ్ వెంకటరత్నం, గోపి, శంకరనాయుడు, పెంచలయ్య, ప్రభాకర్, చెంచయ్య, బొమ్మయ్య, చంద్రబాబు, రాఘవులు, భాస్కర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## సుబ్బమ్మ కర్మ క్రియలకు సిపాయి భరోసా




రేణిగుంట, జూలై 30 ప్రభాతవార్త:

రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ గొల్లపల్లి గ్రామానికి చెందిన సుబ్బమ్మ కర్మ క్రియలకు ఎమ్మెల్సీ డా. సిపాయి సుబ్రహ్మణ్యం ఆదివారం సిపాయి భరోసా ద్వారా 40 రకాల నిత్యావసర సరకులను ఆమె భర్త రాముకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చేస్తున్న ప్రజాసేవను ఆదర్శంగా తీసుకుని సిపాయి భరోసా ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజాసేవచేయడంలో భాగంగా సిపాయి భరోసాని చేపట్టామన్నారు. కార్యక్రమంలో డా. బాబు, సర్పంచ్ ఈశ్వరమ్మ, గోపాల్‌రెడ్డి, మునిరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నత్తనడకన ఓటర్ల పరిశీలన

కోట, జూలై 30 ప్రభాతవార్త

ఇంటింటా ఓటరు సర్వే నత్తనడకన సాగుతోంది. పదిరోజులు గడిచినా పదిశాతం కూడా పరిశీలన చేయలేని దయనీయ స్థితి నెలకొంది. ఇందుకు బిఎల్ఓ యాప్ సర్వర్ మొరాయిస్తోండటమే కారణమని తెలుస్తుంది. ఒక ఓటరు వివరాలు పరిశీలించేందుకు కొన్ని సందర్భాలలో గంటసేపు కూడా సమయం పడుతోంది. దీన్ని బట్టి సదరు యాప్ ఏ స్థాయిలో ఇబ్బంది పెడుతుందో తెలుస్తోందని పలువురు అంటున్నారు. ఈ నెల 25, 26 తేదీలలో వర్షాలు కురవడంతో నెట్‌వర్క్ సరిగా పనిచేయలేదు. ఇతర రోజుల్లోనూ ఇదే సమస్య తలెత్తుతోంది. ప్రతి ఓటరు వివరాలను విధిగా నిర్దేశిత డోరు నంబర్లలో ఉన్నారా లేరా, సమగ్ర వివరాలు ఉన్నాయా లేవా అని పరిశీలించాల్సి ఉంటుంది. ఇందులో ఏవైనా తప్పులు దొర్లినా, సమగ్ర వివరాలు లేకపోయినా చేర్పులు, మార్పులు చేయాలి. ఈ ప్రక్రియ క్షేత్రస్థాయిలో వేగంగా సాగాలి. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం ఈ నెల 21వ తేదీన మొదలైన సంగతి తెలిసిందే. ఈ ప్రక్రియ ఆగస్టు 21 వరకు కొనసాగుతుంది. ఈలోగా ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి వివరాలు ధ్రువీకరించాలి. ఎన్నడూ లేని విధంగా రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. ఇంటింటా సర్వే ప్రక్రియలో బిఎల్ఓతో పాటు సంబంధిత రాజకీయ పార్టీల బూత్‌స్థాయి ఏజెంట్ కూడా వెళ్లేందుకు అవకాశం కల్పించింది. ఇప్పటికే రాజకీయ పార్టీలతో తహశీల్దార్లు సమావేశం ఏర్పాటు చేసి దిశాదశ నిర్దేశం చేశారు.

అయితే ఈ వ్యవహారంతో అధికార వైసీపీ ముందంజలో ఉంది. అన్ని ప్రాంతాల్లో బిఎల్ఓ జాబితాను సంబంధిత విఆర్ఓలకు అందజేశారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ టిడిపి మాత్రం కొంత వెనుకబడినట్లు తెలుస్తోంది.

# పార్టీల ప్రమేయం లేకుండా సంక్షేమమే ఎమ్మెల్యే అజెండా

## - బియ్యపు పవిత్రరెడ్డి

రేణిగుంట, జూలై 30 ప్రభాతవార్త:

పార్టీలతో ప్రమేయం లేకుండా అభివృద్ధి చేయడమే అజెండాగా శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పని చేస్తున్నారని మండల వైసీపీ ఇన్‌చార్జి పవిత్రరెడ్డి అన్నారు. రేణిగుంట శ్రీనివాస జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం మండల ముస్లిం మైనారిటీల సమావేశం వైసీపీ మండల ఇన్‌చార్జి పవిత్రరెడ్డి అధ్యక్షతన జరిగింది. నెల్లూరు నగరంలో రొట్టెల పండుగ జరుగుతున్నప్పటికీ పెద్ద సంఖ్యలో ముస్లిం మైనారిటీలు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముస్లిం మైనారిటీలు ఖబరస్తాన్, మసీదులకు ప్రహరీ గోడల నిర్మాణాలు, ఇంటిస్థలాలకు సంబంధించి సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అందరి సమస్యలను సావధానంగా విన్న పార్టీ ఇన్‌చార్జి పవిత్రరెడ్డి సానుకూలంగా స్పందిస్తూ ఎమ్మెల్యే తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేకు పార్టీలతో సంబంధం లేదని ఏ పార్టీకి చెందిన



వారి సమస్యలనైనా పరిష్కరిస్తారన్నారు. ముఖ్యంగా పార్టీ నాయకులు పార్టీకి చెడ్డపేరు తీసుకు రాకూడదని తెలిపారు. ఇంతకు ముందు ఏ పార్టీ నేతలు చేయని అభివృద్ధి ఎమ్మెల్యే చేస్తున్నారన్నారు. ముఖ్యంగా పేద ముస్లిం మైనార్టీ అకుటుంబాల్లో పెళ్లిళ్ల జరిగితే కొంత మంది ఆర్థిక సాయం, మరి కొంత మందికి బీరువా, డబుల్ కాట్ బెడ్, గృహ సామగ్రిని మేనమామ సాంఘ్యంగా ఇస్తున్న ఘనత ఎమ్మెల్యేకు దక్కుతుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఆయన కార్యకర్తలను విస్మరించరని, కచ్చితంగా వారికి న్యాయం చేస్తారని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీటీ, పలువురు వీఆర్‌వోలు, ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, వైసీపీ సీనియర్ నేతలు దయాకర్‌రెడ్డి, ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదిర్, పట్టణ వైసీపీ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, కో-ఆప్షన్ మెంబరు సుభాన్‌రాజా, వైసీపీ సీనియర్ నాయకులు గురవరాజు పల్లె రహీం, పెద్ద మసీదు ముత్తవల్లి బాబు, ఇరానీ ఖాదిర్, పద్మానగర్ రషీద్, అడ్వకేట్ జాకీర్ హుస్సేన్, రేణిగుంట పట్టణ వైసీపీ అధ్యక్షుడు ప్రభాకర్, ఎంపీటీసీ శశికిరణ్, అశేషంగా ముస్లిం మైనారిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శివయ్యను దర్శించుకున్న చిత్తూరు డివైఈఓ


.శ్రీకాళహస్తి, జూలై 30 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం చిత్తూరు విద్యాశాఖ డివైఈవో జి.చంద్రశేఖర్ కుటుంబ సభ్యులతో విచ్చేశారు. ఆయనకు విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది ప్రశాంత్, ఆలయాధి కారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. ఆలయంలో స్వామిఅమ్మవార్ల ప్రత్యేకదర్శనం చేసుకోవడంతో పాటు పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం వీరికి దక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామివారిశేషవస్త్రంతో సత్కరించి వేదపండితుల ఆశీర్వచనాలు అందించారు.

## మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షించిన బిజెపి నేతలు

శ్రీకాళహస్తి, జూలై 30 ప్రభాతవార్త



ప్రధాని నరేంద్రమోడీ నిర్వహించే మన్‌కీ బాత్ కార్యక్రమం శ్రీకాళహస్తిలో బిజెపి నాయకులు వీక్షించారు. మన్‌కీ బాత్ ద్వారా అనేక విషయాలు తెలుసుకుని దేశ ప్రజలు సమగ్ర అభివృద్ధి దిశగా ఎలా సాగుతున్నారో కార్యక్రమం అద్దం పడుతుందని బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి కోలా.ఆనంద్‌కుమార్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని శ్రీకాళహస్తిలోని 99 పోలింగ్‌బూత్ పరిధిలోని సాలిపేటలో బిజెపి ఓబిసినేత వెంకటేశ్వర్లు గృహంలో బిజెపి నాయకులు తిలకించారు. అలాగే శ్రీరాంనగర్ కాలనీలోని శైలజ గృహంలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని విద్యార్థులతోకలసి బిజెపి రాష్ట్ర కార్యదర్శి కండ్రిగ.ఉమ బిజెపి నాయకులు తిలకించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి కండ్రిగ ఉమ మాట్లాడుతూ అనేక కొత్త విషయాలు మన్‌కీబాత్ ద్వారా తెలుసుకుంటున్నామని అన్ని వర్గాల ప్రజల జీవనశైలికి, చిరు వ్యాపారాలతో ఎలా అభివృద్ధి చెందుతున్నామో వివరించారు. కార్యక్రమంలో ఓబిసి మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమాసింగ్, బిజెపి పట్టణ అధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు, సొట్టసుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన

.శ్రీకాళహస్తి, జూలై 30 ప్రభాతవార్త



పట్టణంలోని బాబుఅగ్రహారం ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. పాఠశాల ఆవరణలో 14మంది ప్రముఖ వైద్యులతో శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని రష్ ఆస్పత్రి అధినేత, ఎంఎల్‌సి డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం ముఖ్యఅతిధిగా విచ్చేసి ప్రారంభించారు. ఉచిత వైద్యశిబిరంలో గుండె, ఈసిజీ,, బిపి, షుగర్, కీళ్ళనొప్పులు, మెడ, ఎముకలు, స్త్రీల వ్యాధులు, చర్మవ్యాధులు, న్యూరాలజీ, చిన్నపిల్లలకు వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆధ్మాత్మిక అవధూత మాసపత్రిక ఎడిటర్ ఆనందరెడ్డి, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

## బైపాస్ రోడ్డు భూనిర్వాసితులను ఆదుకుంటాం

-ఎమ్మెల్యే ఆదిమూలం

నాగలాపురం, జూలై 30 ప్రభాతవార్త:



దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూములను అందించి, భూనిర్వాసితులుగా మారిన భాదిత రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే ఆదిమూలం భరోషా కల్పించారు. మండలంలోని సురుటుపల్లి మిట్టకండ్రిగలో ఆదివారం ఉదయం భూనిర్వాసితులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. త్వరిత గతిన రోడ్డు నిర్మాణం పూర్తిచేసి ఈప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరడంకోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అనంతరం భాదితులకు నష్ట పరిహారం చెల్లింపులు, భూమి కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ స్థల కేటాయింపుల అంశంపై చర్చించారు.

## తొండవాడ సత్యన్నకు పులివర్తి దంపతుల ఘననవాళి

చంద్రగిరి, జూలై 30 ప్రభాతవార్త:



తొండవాడ మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకుడు తపసి సత్యనారాయణ రెడ్డి చిత్రపటానికి పులివర్తి దంపతులు పుష్పాంజలి ఘటించి, ఘననివాళులర్పించారు. చంద్రగిరి మండలం, తొండవాడకు చెందిన సత్యనారాయణ రెడ్డి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి 4 దశాబ్దాలుగా ప్రజలకు విశిష్ట సేవలందిస్తున్నారు. ఈ నెల 19న గుండెపోటుకు గురై ఆయన మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన ఖర్మక్రియలకు హాజరైన పులివర్తి నాని, పులివర్తి సుధారెడ్డి దంపతులు సత్యన్న కుటుంబ సభ్యులు తపసి మల్లీశ్వరీ, తపసి తిరుమల రెడ్డి, తపసి లత, పులికంటి మోహన్ రెడ్డి, పులికంటి తేజోవతి, తపసి జయపాల్ రెడ్డి, తపసి లక్ష్మీ, తపసి శ్రీదర్ రెడ్డి, తపసి సుకన్య, కుటుంబ సభ్యులను పరామర్శించారు. సత్యన్న సేవలను కొనియాడారు. ఆయన సేవలను పార్టీ ఎన్నటికీ విస్మరించబోదన్నారు. వారి కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుదన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

పుత్తూరు, జూలై 30 ప్రభాతవార్త :

లారీని ఢీకొన్న సంఘనలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు మండలంలోని కైలాసపురం వద్ద వున్న ప్రైవేటు ఫ్యాక్టరీలో మహారాష్ట్ర రాష్ట్రం ఔరంగాబాద్‌కు చెందిన రామచంద్ర తోటే (57) పనిచేస్తున్నారు. శనివారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై పుత్తూరు పట్టణానికి బయలుదేరారు. మార్గమధ్యంలో వేపగుంట క్రాస్ వద్ద నగరి - తిరుపతి రహదారిపై ఆగి వున్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. స్థానికులు గుర్తించి ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం తిరపతికి పంపించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డాలర్స్ గ్రూప్ పదవ వార్షికోత్సవంలో డాలర్స్‌కు మద్దతుగా ఎంఆర్ఆర్

తిరుచానూరు, జులై 30, ప్రభాతవార్త



డాలర్స్ గ్రూప్ రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థ ద్వారా యువనేత డాలర్ దివాకర్ రెడ్డి రియల్ ఎస్టేట్ రంగంలో అడుగుపెట్టి పదవ సంవత్సరం సందర్భంగా వార్షికోత్సవ వేడుకలను చంద్రగిరి కోట వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీ తారలు, బాలీవుడ్, యాంకర్లు హాజరయ్యారు. కనువిందు చేసే సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఆరు మండలాలలో నుండి దాదాపు 50 వేల అభిమానులు, కస్టమర్లు హాజరయ్యారు. అదే విధంగా తిరుచానూరు నుండి దివాకర్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, ఎంఆర్ఆర్ పౌండేషన్, చైర్మన్ మునిరామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంఫ్యాక్ట్ ఫౌండేషన్ సభ్యులు మునిలక్ష్మి, శివశక్తి మహిళా సంఘం సభ్యులు జమున, లైన్ శీను, తిరుచానూరు యూత్ బ్యానర్లు పట్టుకుని పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు తెలిపారు. దివాకర్ రెడ్డి రాజకీయాల్లోకి రావాలని ప్రజలకు మరెంతో సేవ చేయాలనే కోరుతూ అమ్మవారి ప్రసాదాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులంతా డాలర్ దివాకర్ రెడ్డి రాజకీయాల్లోకి రావాలని గట్టిగా కేకలు వేస్తూ నినాదాలు చేశారు.

## నిత్యాన్నపథకానికి విరాళం

శ్రీకాళహస్తి,జూలై 30 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తుల నుంచి విరాళాలు విరివిగా అందుతున్నాయి. ఈ పథకానికి 80జి ప్రకారం ఆదాయపు పన్ను మినహాయింపు ఉండటంతో భక్తులు ముందుకు వస్తున్నారు. దేశంలోని నలుమూలల నుంచి భక్తులు తండోపతండాలుగా కదలి వస్తున్నారు. విరాళాలు అందిస్తున్నారు. ఈ నేనపథ్యంలో గుజరాత్ రాష్ట్రానికి చెందిన అహమ్మదాబాద్‌కు చెందిన కే.నాగేశ్వరరావు అనేభక్తుడు వారి తల్లి కె.లక్ష్మీనాగేశ్వరమ్మ పేరుతో రూ.75వేలు విరాళంగా అందించారు. ఈ మేరకు చెక్కును ఎఇఒ సతీష్‌మాలిక్, సూపరింటెండెంట్ విజయసారధిలకు అందించారు. వారికి ఆలయం తరఫున ప్రత్యేక దర్శనాలు, అశీర్వచనాలు తీర్థ ప్రసాదాలు అందించారు.

## ముదిరాజులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి!

ముదిరాజ్‌సంఘం



శ్రీకాళహస్తి,జూలై 30 ప్రభాతవార్త

ఎన్నికల ముందు ముదిరాజ్‌లకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తామని భరోసా ఇచ్చే పార్టీలు తరువాత విస్మరిస్తున్నారని ఆదివారం ఇక్కడి మహేష్ కళ్యాణ్ సదన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో డిమాండ్ చేసారు. నియోజకవర్గంలోని ముదిరాజ్ కులస్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముదిరాజ్‌సంఘం నాయకులుమాట్లాడుతూ నియోజకవర్గంలో 20వేల మంది ఉన్నారని వారికి రావాల్సి న పదవులు దక్కడం లేదన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పిస్తూ ప్రత్యక్ష, నామినేటెడ్ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేసారు. నియోజకవర్గంలోని ముదిరాజ్‌లు అందరూ కలసికట్టుగా ఐకమత్యంగా ముందుకు సాగాలన్నారు. ముదిరాజ్‌లకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించుటకు సంఘం సిద్దంగా ఉందన్నారు. తమ సంఘం సారథ్యంలో ముదిరాజ్‌లను ఏక త్రాటిపై తెచ్చుటకు త్వరలో గ్రామ కమిటిలు, మండల కమిటీలు, వివిధ అనుబంధ కమిటీల ఏర్పాటుకు ప్రణాళిక సిద్దం చేస్తున్నట్లు నాయకులు వివరించారు. భవిష్యత్తులో ఈ కమిటీల ద్వారా అనేక సేవా కార్యక్రమాలు ముదిరాజ్ వేదిక, ప్రతిభావంతులైన వారికి విద్యార్థులకు ప్రోత్సహకాలు, విశ్రాంత ఉద్యోగులకు సన్మానాలు నిరుపేద కుటుంబాలను ఆదుకొనుటకు సహాయం అందించుటకు ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. ఈ ఆత్మీయ సమావేశంలో ఎ.కన్నయ్య, పి.బత్తినయ్య, వెంకటరమణయ్య, పూల ఆనంద్, చిట్టేటిచ ఇన్నా, కోటేశ్వరరావు, గోవిందస్వామి, వెంకటకృష్ణయ్య, ఆకుల గురుమూర్తి, అయ్యప్ప, ఆర్.సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, సుధాకర్, ఈశ్వర్, రాజా, కృష్ణ, భాస్కర్, సతీష్, వేణు, నరేంద్ర, శివ, సురేంద్ర, దేశయ్య, అంకయ్య తదితరులు పాల్గొన్నారు

## బిసిల ఆత్మగౌరవాన్ని అవహేళన చేస్తున్న జగన్

శ్రీకాళహస్తి, జూలై 30 ప్రభాతవార్త



వైసిపి పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జగన్‌మోహన్‌రెడ్డి బిసిల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా అవహేళన చేస్తూ బిసిలను అణగదొక్కుతున్నాలని ప్రయత్నం చేస్తున్నారని తెలుగుదేశంపార్టీ గాండ్ల, తెలికుల బిసి సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మరియు తిరుపతి పార్లమెంటు బిసి సెల్ సోషల్‌మీడియా ఇన్‌ఛార్జి కన్నావరంహరిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, చిన్నారులు, బాలికలపై అఘాయిత్యాలు జరుగుతున్నా కనీసం ప్రభుత్వం చర్యలుతీసుకోవడంలో పూర్తిగా విఫలం అయ్యిందని దుయ్యబట్టారు. బిసిలపై నేడు రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను ప్రశ్నించేవారిపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలుగుదేశంపార్టీ జాతీయ కార్యదర్శి నారాలోకేష్ ఒంగోలు పట్టణంలో యువగళం పాదయాత్ర వేదికగా బిసి కుటుంబాలకు భరోసా ఇస్తే ఫెయిడ్ ఆర్టిస్టులని అవహేళన చేయడానికి బిసి వ్యక్తిగా ఉండి మోపిదేవ వెంకటరమణ సిగ్గుపడాలన్నారు. ఎప్పుడైనా సరే తెలుగుదేశంపార్టీకి బిసిలు వెన్నంటే ఉంటారని తెలిపారు.

# తిరుపతి డివిజన్

## విద్యార్థులకు ఆటంకం లేకుండా రోడ్డ నిర్మాణం సాగాలి

యూనివర్సిటీ రోడ్ల నిర్మాణం పై వామపక్ష నేతలు

తిరుపతి (క్రీడ), జూలై 30, ప్రభాతవార్త

యూనివర్సిటీ మధ్యన రోడ్డ నిర్మాణం కారణంగా ఏదో ఒక వైపున రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ట్రాఫిక్ కష్టాలను అధిగమించడానికి చేసే ప్రయత్నానికి తాము స్వాగతిస్తామని సిపిఎం సిపిఐ నాయకులు తెలిపారు. ఆదివారం నాటి ఉదయం సిపిఎం సిపిఐ జిల్లా నేతలు ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థి నేతలతో కలిసి రోడ్డ నిర్మాణం జరిగే ప్రాంతాలను పరిశీలించారు. మాస్టర్ రోడ్డ నిర్మాణం పేరుతో గతంలో ఆమోదం పొందిన విధంగా ఒక రోడ్డు నిర్మించి యూనివర్సిటీ విద్యార్థులకు, అధ్యాపకులకు, విద్యా వాతావరణానికి ఆటంకం కలుగని రీతిలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని మున్సిపాలిటీకి సూచించారు. యూనివర్సిటీ మధ్యలో మూడు, నాలుగు రోడ్లు వేయాలన్న ప్రతిపాదనలను విరమించుకోవాలని కోరారు. యూనివర్సిటీ మధ్యలో ఉన్న రోడ్లను మరింత వెడల్పు చేసి విద్యార్థులు, అధ్యాపకులకు తోడ్పడేటట్లుగా మెరుగు పరచవచ్చని సూచించారు. బిజెపి వంటి పార్టీలు చేస్తున్న ప్రచారాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. తిరుపతి నగరం పెరుగుతున్న దృష్ట్యా ట్రాఫిక్ కష్టాలు పెరుగుతున్న నేపథ్యంలో మరిన్ని రోడ్లు కావాల్సి ఉందని అన్నారు. ఈ పేరుతో విద్యా సంస్థలు, వైద్య సంస్థలు వాటి ప్రత్యేకతలను కాపాడేటట్లుగా వ్యవహరించాలని, ప్రత్యేకే జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ పరిశీలనా కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కందారపు మురళి, సిపిఐ జిల్లా కార్యదర్శి పి. మురళి విద్యార్థి సంఘం నేతలు రవి, అక్బర్, ఉరుకుందు, ప్రసన్న, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు

కార్వేటినగరం,జూలై 30 ప్రభాతవార్త:




గంగాదరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ వి.ఎం. థామస్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు తగదని ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వి.దామోదరం అన్నారు. కార్వేటినగరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డాక్టర్ థామస్‌పై వెదురుకుప్పంమండలం తిప్పినాయుడుపల్లి సర్పంచ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండల దళితనాయకులు తలారి మునికృష్ణ, చెంగల్‌రాయులు, యోనా, చిరంజీవి, మురళిమోహన్, లక్ష్మీపతిలు మాట్లాడారు. రాజకీయంలో ఒకరిపై ఒకరు మాట్లాడుకోవడం సహజమని అయితే సంస్కారంతో మాట్లాడాలే తప్ప బూతులతో వల్లించి మాట్లాడితే అందుకు పదిఅంతలు మాట్లాడడం మాకు బూతుమాటలు వచ్చని దాము హెచ్చరించారు. మీరు ధర్మాత్ములు అయితే మీ సొత్తులు ఇవ్వండన్నారు. ఈ సంధర్భంగా మాజీ ఎస్సీ సెల్ కార్యదర్శి టి.మునికృష్ణ మాట్లాడుతూ మాకు సంస్కృతులు రావని, మా చంద్రబాబునాయుడు నడవడికలో నడుస్తున్నందున మీలాగ సిగ్గు వదిలి బూతులు మట్లాడమన్నారు. సర్వేనె. 163-2లో 40సెంట్లు. అందులో ఆయన చెట్లు పెట్టుకున్నారు. చాలా జాగ్రత్తగా మాట్లాడితే మంచిదన్నారు.

## అలరించిన మహాభారత పారాయణం

నగరి, జూలై 30 ప్రభాతవార్త:



మున్సిపల్ పరిధి చింతలపట్టెడలోప్రతి ఏడాది వైభవంగా నిర్వహించే ద్రౌపదీ తిరుణాళ్ళలో భాగంగా ఆదివారం మహాభారత పారాయణం నిర్వహించారు. భాగవతారులు షకీల, కభాళీశ్వరన్ మహాభరత పారాయణం చేశారు. తిరుణాళ్లు ముగిసేంత వరకు ఆలయం వద్ద మహాభారత పారాయణం జరుగుతుందని ఉత్సవ నిర్వాహకులు డా. ఎం.వి.నటరాజన్ తెలిపారు. ఏడాదికి ఒక సారి తిరుణాళ్ళ సందర్భంగా ద్రౌపదమ్మ ఆలయం వద్ద మహాభారత పారాయణం వింటే చేసిన పాపాలు నివృత్తి అవుతుందన్న నమ్మకం భక్తుల్లో ఉండడంతో పారాయణం వినడానికి ఆలయం వద్ద భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## శివాలయంలో నంది ప్రదోష పూజలు

పుత్తూరురూరల్, జూలై 30 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలో నంది ప్రదోష పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని కామాక్షి దేవి సదాశివేశ్వరుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణలు చేశారు. అలాగే ఆవరణలో ఉన్న పరివార దేవతలకు కూడా ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నందీశ్వరుడికి ప్రదర్శి సందర్భంగా అభిషేకాలు, అలంకరణలు చేశారు. భక్తులు నందీశ్వరుడికి కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొడగంటి రమేష్‌బాబు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవులపైన జరుగుతున్న దాడులు హేయమైన చర్య - పాస్టర్ డేవిడ్

రేణిగుంట, జూలై 30 ప్రభాతవార్త:



మణిపూర్ క్రైస్తవులపై జరిగిన దాడులు హేయమైన చర్య మాత్రమే కాదని, యావత్ సభ్య సమాజం తలదించుకునేలా ఉందని జెరూసలేం అపోస్తలిక్ చర్చి పాస్టర్ చంద్రన్ డేవిడ్ అన్నారు. రేణిగుంట పట్టణ వీధుల్లో ఆదివారం రేణిగుంట బెరూసలేం అపోస్తలిక్ చర్చి సభ్యులు మణిపూర్‌లో క్రిస్టియన్లపై జరుగుతున్న దాడులకు నిరసనగా శాంతి యుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డేవిడ్ మాట్లాడుతూ భారతదేశం లౌకిక దేశంగా అభివర్ణించారు. కుల మతాలకతీతంగా అందరూ స్వేచ్ఛాయుతంగా జీవించే హక్కును రాజ్యాంగం కల్పించిందన్నారు. అలాంటి లౌకిక దేశంలో దాడులు జరగడం అమానుషమన్నారు. ర్యాలీలో పాస్టర్ అనిల్ రాజు, చర్చి సభ్యులు పాల్గొన్నారు.

## మనసున్న వ్యక్తి ఉపాధ్యాయుడు రమేష్

-నివాళులర్పించిన పులివర్తినాని

యర్రావారిపాళెం,జులై 30ప్రభాతవార్త:



యర్రావారిపాళెం మండలం చింతగుంటపంచాయతి పసుపులేటివారిపల్లె టిడిపి సీనియర్ నాయకుడు ఉపాధ్యాయుడు రమేష్ అకాల మృతితో మనసున్న మంచి వ్యక్తిని కోల్పోయామని టిడిపి జిల్లా అధ్యక్షుడు పులివర్తినాని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల మనిషిని పార్టీ కోల్పోయిందని సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం జరిగిన ఆయన దశదినకర్మకు పులివర్తినాని, టిడిపి నియోజకవర్గనాయకులు ,కార్యకర్తలు హాజరై రమేష్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. చింతగుంటగ్రామానికి టిడిపి చేసిన సేవలు మరవలేనివని ,రమేష్ కుటుంబానికి ఎల్లవేళలా అండగా వుంటామని ఆత్మస్థైర్యం నిచ్చారు.

## 4 నుంచి ఆడికృత్తిక మహోత్సవాలు:

శ్రీకాళహస్తి,జూలై 30 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నెల నెలా ఓ ఉత్సవం నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ఆగస్టు 4నుంచి ఆడికృత్తిక మహోత్సవాలు నిర్వహించుటకు ఆలయాధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. గతంలో ఆడికృత్తిక అంటే స్థానిక భక్తులు కూడా తిరుత్తణికి వెళ్ళేవారు. కానీ గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడి ఆలయానికి అనుబంధంగా ఉన్న కుమారస్వామి తిప్పపై వెలసిన కుమారస్వామి ఆలయంలోభారీ ఎత్తున మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికలు సిద్దమయ్యాయి. వీటిని మంగళ వారం ఆవిష్కరించనున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో చెంగల్వరాయస్వామి ఆలయంలో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. అలాగే విజ్ఞానగరిపై వెలసిన కుమారస్వామి కొండపై భారీ ఎత్తున మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లును ఆలయ ఇఒ కె వి సాగర్‌బాబు అర్చకులతో సమీక్షించారు. ఆదివారం ఉదయం నుంచి ఆయన ఆలయంలో పరిశీలనలు జరిపారు.

# ఈ పాపం ఎవరిది..?

## -శాంతినగర్ కల్వర్టుకు గోడలేక వ్యక్తి మృతి

శ్రీకాళహస్తి, జూలై 30 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి-నాయుడుపేట రోడ్డు పక్కనే ఉన్న శాంతినగర్‌లో సుమారు 250కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గతంలో ఇక్కడ ఎలాంటి ఇండ్లు ఉండేవికాదు. రానురాను ఈ ప్రాంతం అంతా ముళ్ళపొదలతో నిండిఉండేది. అయితే ప్రస్తుతం ఇక్కడ అభివృద్ది చెందింది. ఇక్కడ బహుళ అంతస్తుల భవనాలు నిర్మించారు. మెయిన్‌రోడ్డు నుంచి శాంతినగర్‌కు వెళ్ళాలంటే చెంబేడు కాలువపై ఉన్న కల్వర్టు దాటుకుని వెళ్ళాల్సి ఉంది. అయితే ఈకల్వర్టుకు ఇరువైపులా పిట్టగోడ లేకపోవడంతో రాత్రివేళల్లో పలువురు ప్రమాదాలకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇటీవల నాలుగు రోజుల క్రితం శాంతినగర్‌లో నివాసం ఉంటున్న కె.ప్రేమ్‌కుమార్ ఈనెల 28వతేదీ మద్యాహ్నం ద్విచక్రవాహనంపై వస్తుండగా మోటార్‌సైకిల్ అదుపుతప్పి చెంబేడుకాలువలోపడి అక్కడికక్కడే



మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. చెంబేడు కాలువపై నిర్మించిన వంతెనకు ఇరువైపులా గోడనిర్మించాలని పలుమార్లు పురపాలకశాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతోనే ఈ దుర్ఘటన జరిగిందని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలును నెరవేర్చడంలో నాయకులు విఫలమయ్యారని శాంతినగర్ ప్రజలు దుయ్యబడుతున్నారు. పురపాలక అధికారులు పన్నులుపై ఉన్న శ్రద్ధ ప్రజల సంక్షేమంపై లేదనడానికి ఇదే ఉదాహరణగా చెప్పవచ్చు. మృతుని కుటుంబాన్ని ఎవరు ఆదుకుంటారని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి శాంతినగర్ వద్ద ఉన్న చెంబేడు కాలువపై ఇరువైపులా గోడను నిర్మించాలని కోరుకుంటున్నారు.

## గంగమ్మ చల్లనిదీవెనలు కోసం ప్రార్థించా

### -కేంద్రమంత్రి డాక్టర్ భారతీప్రవీణ్‌సవార్



తిరుపతి.జులై 30ప్రభాతవార్త : తిరుపతి నగర గ్రామదేవతగా పూజలందుకుంటున్న శక్తిస్వరూపిణి తాతయ్యగుంట గంగమ్మ చల్లని దీవెనలు ప్రజలందరికీ కలగాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వేడుకున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతిప్రవీణ్‌పవార్ తెలిపారు. తిరుపతికి వచ్చిన కేంద్రమంత్రి దంపతులు ఉదయం గంగమ్మకు భక్తితో పవిత్రమైన సారెను సమర్పించారు. ఆలయం వద్దకు విచ్చేసిన కేంద్రమంత్రి దంపతులకు బిజెపి నేతలు గుండాలగోపీనాథరెడ్డి,సుబ్రమణ్యంయాదవ్, రాజశేఖర్‌రెడ్డి , చెంగారెడ్డి, చంద్రబాబుయాదవ్, గంగమ్మ ఆలయ ఇఒ ఎం.మునికృష్ణయ్య, అర్చకులు స్వాగతం పలికారు. అనతంరం ఆలయంలో గంగమ్మను దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారితీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## మన రాకెట్ల ద్వారా మరిన్ని సింగపూర్ ఉపగ్రహాలు

### - ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్





షార్‌లో మాట్లాడుతున్న ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్, ఎన్ఎస్ఐఎల్ సిఎండి రాధాకృష్ణన్

శ్రీహరికోట (తడ), జూలై 30 ప్రభాతవార్త

సింగపూర్ దేశానికి చెందిన మరిన్ని ఉపగ్రహాలను అంతరిక్షంలో ప్రవేశపెట్టడానికి సిద్ధంగా ఉన్నామని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఛైర్మన్ ఎస్.సోమనాథ్ పేర్కొన్నారు. ఆదివారం శ్రీహరికోటలోని మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ఆయన మాట్లాడారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న కారణంగా రాకెట్ ప్రయోగ విజయం అనంతరం జరిగే ప్రెస్‌మీట్ రద్దయింది. ఈ కారణంగా ఛైర్మన్ ఎంసిసి నుంచి మాత్రమే మాట్లాడారు. న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్, సింగపూర్ అంతరిక్ష పరిశోధన సంస్థలకు పిఎస్ఎల్‌వి సి-56 ప్రయోగ విజయాన్ని అంకితం చేస్తున్నట్లుగా సోమనాథ్ పేర్కొన్నారు. ఇప్పటికే పలుసార్లు సింగపూర్ ఉపగ్రహాలను మన శ్రీహరికోట రాకెట్ల ద్వారా ప్రయోగించామని, వారికి ఎప్పుడూ అందుబాటులో ఉంటామని చెప్పారు. ఈ ఏడాది మరో నాలుగు ప్రయోగాలను అతిత్వరలో చేపట్టనున్నట్లు సోమనాథ్ పేర్కొన్నారు. ఎస్ఎస్ఎల్‌వి డీ-3 రాకెట్‌తో పాటు మరో పిఎస్ఎల్‌వి రాకెట్‌ను త్వరలోనే ప్రయోగిస్తామన్నారు. పిఎస్ఎల్‌వి సి-57 ద్వారా ఆదిత్య ఎల్1 ప్రయోగం ఉంటుందని చెప్పారు. జిఎస్ఎల్‌వి రాకెట్ ద్వారా ఇన్‌శాట్ ఉపగ్రహాన్ని ప్రయోగిస్తామన్నారు. గగన్‌యాన్ టెస్ట్ వెహికల్ మిషన్‌ను కూడా త్వరలోనే శ్రీహరికోట నుంచి ప్రయోగిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం రాకెట్ ప్రయోగంలో డీఆర్బిటింగ్ ఎక్స్‌పెరిమెంట్ చేపట్టి అంతరిక్షంలోని వ్యర్థాలను తగ్గించడానికి భారత్ తమవంతుగా కృషి చేసిందని ఛైర్మన్ పేర్కొన్నారు. ఎన్ఎస్ఐఎల్ సిఎండి రాధాకృష్ణన్ మాట్లాడుతూ 2015లోనే టిలోఎస్-1 ద్వారా సింగపూర్ దేశానికి చెందిన ఉపగ్రహాలను తాము ప్రయోగించామని గుర్తు చేశారు. ఇప్పటికి మూడుసార్లు తమను నమ్మి సింగపూర్ దేశస్తులు ముందుకు వచ్చారని, ఇది నాలుగోసారిగా ఆయన చెప్పారు. మా మీద నమ్మకాన్ని ఉంచిన సింగపూర్ దేశస్తులకు ఇంకా ఇంకా అవకాశం ఇచ్చి వారి ఉపగ్రహాలను ప్రయోగిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మిషన్ డైరెక్టర్ ఎస్ఆర్ బిజు మాట్లాడుతూ పిఎస్ఎల్‌వి సిరీస్‌లో 58వ ప్రయోగం అయితే, 56 విజయాలు సాధించినట్లు చెప్పారు. కేవలం 16 రోజుల్లోనే ఇస్రో రెండు పెద్ద ప్రాజెక్టులను విజయవంతం చేసినందుకు సహచర శాస్త్రవేత్తలు, ఇస్రో కేంద్రాల అధికారులు, ప్రైవేటు కంపెనీలు వంటి వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా తమ మీద నమ్మకం ఉంచుతున్న విదేశీ కస్టమర్లకు కూడా ఆయన అభినందనలు చెప్పారు.



వీక్షకుల గ్యాలరీలో సందర్శకుల సందడి

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం



కాణిపాకం, జూలై 30 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు ఆదివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు తిరుమల బాలాజీనగర్‌కు చెందిన అచ్యుతాప్రభు అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సురేష్‌కు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## దిగువమాఘంలో అలరించిన దుర్యోధన వధ

### -కిక్కిరిసిన భక్తజనం



తవణంపల్లె, జూలై 30 ప్రభాతవార్త:

మండలంలోని దిగువమాఘం గ్రామంలో జరుగుతున్న మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఆదివారం జరిగిన దుర్యోధన వధ ఘట్టం ఎంతో అలరించింది. గ్రామంలోని బహుదానది ఒడ్డున వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ధర్మకర్త ఆర్.ఉమాపతిరెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, గల్లా రామచం ద్రనాయుడుల సహకారంతో గ్రామస్థులు ఈనెల 6 నుండి మహాభారత యజ్ఞం కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం విధితమే. ఇందులో భాగంగా మహాభారత యజ్ఞంలో చివరి రోజు దుర్యోధన వధ ఘట్టం ఆట్టహాసంగా జరిగింది. తమిళనాడు రాష్ట్ర తిరుపత్తూరు శ్రీలక్ష్మీ నారాయణ నాట్యమండలి కళాకారులు దుర్యోధన వధ ఘట్టాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి వారి ఆలయంలో ఉదయం ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం బహుదానదిలో బంకమట్టితో దుర్యోధనుడి బొమ్మను తీర్చిదిద్ది ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా కళాకారులు దుర్యోధనుడిని భీమసేనుడు మడుగు నుండి రప్పించే సన్నివేశం కళ్ళకు కట్టినట్లు కళాకారులు ప్రదర్శించారు. అలాగే దుర్యోధనుడు, భీమసేనుల మధ్య యుద్ధ సన్నివేశాలు, పద్యాలు అలరించాయి. భీమసేనుడు దుర్యోధనుడిని తొడపై గదతో కొట్టి వధించి రక్తాన్ని ద్రౌపదీదేవి కురులకు పూసే సన్నివేశాల్లో పాత్రదారులు జీవం పోశారు. ఈకార్యక్రమంను తిలకించడానికి మండలంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వేలాది మంది భక్తులతో బహుదానది కిక్కిరిసింది. ఈకార్యక్రమంలో ధర్మకర్త ఉమాపతినాయుడు, నిర్వహకులు జ్యోతీశ్వరనాయుడు, మాజీ సర్పంచ్ కుమార్‌నాయుడు, రాజశేఖర్‌నాయుడులతో పాటు వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

## కొండలను తవ్వేస్తున్నారు..!

### కంకర క్వారీల నిర్వాహణపై ఏదీ పర్యవేక్షణ..?

### గ్రామీణులకు తప్పని ఇక్కట్లు -సత్యవేడు మండలంలో క్వారీల దందా



వందల అడుగుల లోతులో కంకర త్రవ్వుతున్న దృశ్యం

సత్యవేడు, జూలై 30,ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం కంకర, గ్రావేల్ క్వారీల నిర్వాహణకు ప్రత్యేక నిబంధనలతో కూడిన నియమావళిని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నది. కానీ సంబంధిత మైనింగ్ అధికారుల చేతివాటమే, నిర్లక్ష్యమో సత్యవేడు మండలంలో కంకర క్వారీల దందా గ్రామీణులకు తలనొప్పిగా మారింది. సత్యవేడు మండలంలోని చమర్తికండ్రిగలో నిర్వహిస్తున్న సెవెన్‌హిల్స్ తదితర కంకర క్వారీలు పరిమితికి మించి వందల అడుగుల లోతులో కొండలను తవ్వేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ కొండలను తవ్వే సమయంలో ఉపయోగిస్తున్న బాంబులు, జరుపుతున్న పేలుళ్ళ కారణంగా ఇప్పటికే పాడిరైతులు, మామిడి రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉందని వారు వాపోతున్నారు. నింబంధనలకు విరుద్ధంగా కంకర క్వారీలు నిర్వాహణ జరుగుతున్నా, ఓవర్ లోడ్ కారణంగా రోడ్లు, పరిసరాలు అస్తవ్యస్తం అవుతున్నా పట్టించుకునే నాధుడేలేడని మండిపడుతున్నారు. క్షేత్రస్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు నెలవారి తాలాయిలు చేరుతుండటంతో , ఓఒక్క అధికారి కూడా ఇక్కడి సమస్యలుపై చర్యలు చేపట్టడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా స్థానిక వైకాపా నేతలకు సంబంధించిన కంకర క్వారీలు నిర్వాహణలో ఉండటం, వారి లారీలే కంకర తరలింపులకు వినియోగిస్తుండగా, నెలవారి చేయి తడుస్తుండటంతో సంబంధిత అధికారులు సైతం మౌనం వహిస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనా కంకర క్వారీల పుణ్యమా అని నిత్యనిరకం అనుభవిస్తున్నామని మండల వాసులు తమ ఇక్కట్ల గోడును వెల్లబోస్తున్నారు. గ్రామీణుల సమస్యలు పరిగణలోకి తీసుకుని మితిమీరి పోతున్న కంకర క్వారీ త్రవ్వకాలపై చర్యలు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

## తవణంపల్లెలో మునీశ్వరునికి పొంగళ్ళు



తవణంపల్లె, జూలై 30 ప్రభాతవార్త:

మండల కేంద్రం తవణంపల్లె గ్రామ సమీపంలో వెలసిన గ్రామ కులదేవుడు శ్రీమునీశ్వర స్వామికి ఆదివారం ఘనంగా పొంగళ్ళు పెట్టి ప్రత్యేకపూజలు నిర్వహించారు. గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీమునీశ్వరుని ఆలయంలో ఉదయం స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా తవణంపల్లె, కక్కలమిట్ట పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పంబలి వాయిద్యాల నడుమ ఊరేగింపుగా పొంగళ్ళు తీసుకువచ్చి జంతుబలులతో స్వామివారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. అలాగే తమ పిల్లలకు పుట్టు వెంట్రుకలను సమర్పించారు. ఆలయ నిర్వహకులు భక్తులు స్వామివారి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

## దళారులపై ఇఓ కన్నెర్ర; నలుగురికి హెచ్చరిక



శ్రీకాళహస్తి,జూలై 30 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిరాటంకంగా సాగుతున్న దళారుల దందాపై ఆదివారం ఆలయ కార్యనిర్వహాణాధికారి కె వి సాగర్‌బాబు కన్నెర్ర చేసారు. ఉదయం నుంచి ఇఓ ఆలయంలో చక్కర్లు కొట్టారు.శనివారం రద్దీతో ఆదివారం వేకువ జామునుంచే ఇఓ ఆలయంలో తిష్టవేసారు. నిత్యం దళారుల దందాకు సంబంధించి విమర్శలు వస్తుండటంతో ఇఓ స్పందించారు.ఉదయం నుంచి ఆయన నాలుగు గోపుర ద్వారాల వద్ద ఆకస్మిక పరిశీలనలు జరిపారు.అలాగే రాహుకేతుమండపాల్లో పరిశీలించారు.అంతేకాక కంచుగడప వద్ద ఎవరు టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రవేశిస్తున్నారు? ఎవరు ఉచితంగా ప్రవేశిస్తున్నారనే అంశాన్ని పరిశీలించారు. హోంగార్డులతో కలసి ప్రతి క్యూలైన్లను పరిశీలించారు.

**పట్టుబడ్డ సెక్యూరిటి గార్డులు!**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఎవరు దళారో ఎవరు భక్తుడో? ఎవరు ఉద్యోగో? తెలియని దుస్థితి చోటు చేసుకుంది.ఆలయాదికారుల పర్యవేక్షణ లోపించటంతో ప్రతి ఒక్కరు దళారిగా మారారు.అక్రమ సంపాదనే ప్రధాన లక్ష్యంగా మారింది.అధికారుల పర్యవేక్షణ లోపంతో హోంగార్డులు కూడా దళారులుగా మారారు.కార్‌పార్కింగ్ వద్దనే 'ప్యాకేజి'మాట్లాడుకోవటం సాధారణమైంది.ఈ నేపధ్యంలో ఆదివారం వేకువ జామున ఆలయ ఇఓ సాగర్‌బాబు మొదటిగోపురం వద్దకు ఆకస్మికంగా తనికీ చేసినపుడు ఇక్కడ కొందరు సెక్యూరిటి గార్డులు రాహుకేతుదోష నివారణ పూజల టిక్కెట్లు కొనుగోలు చేసి భక్తులకు విక్రయిస్తూ పట్టుబడ్డారు.వారిని హెచ్చరించి పంపారు. ఇకమీదట పట్టుబడితే ఇంటికి పంపుతామని హెచ్చరించారు.ఇఓ ఆదివారం పర్యవేక్షణతో కొంత వరకు ఆలయంలో దళారుల దందాకు కొంత బ్రేక్ పడింది. ఇలాగే ప్రతిరోజూ పర్యవేక్షణ జరిపితే కొంత వరకు దళారులకు బ్రేక్ పడుతుందనటంలో సందేహం లేదు.

## మణిపూర్ అల్లర్లపై ఫాస్టర్ల శాంతియుత ర్యాలీ



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఫాస్టర్లు

శ్రీకాళహస్తి, జూలై 30 ప్రభాతవార్త

మణిపూర్ అల్లర్లపై శ్రీకాళహస్తి పట్టణంలోని అన్ని చర్చిల ఫాస్టర్లు ఆదివారం చర్చిలో అల్లర్లు పూర్తిగా మారాలని ప్రార్ధనలు చేపట్టారు. అనంతరం మణిపూర్‌లో అల్లర్లు సత్వరం రూపుమాపాలని కోరుతూ అందరు ఫాస్టర్లు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు ఫాస్టర్లు మాట్లాడుతూ మణిపూర్‌లో గిరిజనులపై దాడులు చేస్తున్నారని ఇది బిజెపి ప్రభుత్వం మతతత్వ అల్లర్లు ప్రేరేపిస్తోందని ఆరోపించారు. ఇలాంటివి ప్రచార మాధ్యమాల్లో రాకుండా, వాట్సాప్‌లో కూడా రాకుండా అక్కడ ఇంటర్‌నెట్ కూడా లేకుండా చేయడం సిగ్గుచేటన్నారు. బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్‌తో కలసి మణిపూర్ లో అల్లర్లు సృష్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతియుత ర్యాలీ కాసాగార్డెన్ వద్ద ఉన్న లూథరన్‌చర్చి నుంచి ప్రారంభమై ఆర్టీసి బస్టాండు, పాతబస్టాండు, బాబుఅగ్రహారం, నగరివీధి, బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధుల్లో సాగింది. కార్యక్రమంలో ఫాస్టర్లు మైకెల్‌బాబు, జీవమణి, సుందరరాజు, ఆంబ్రోస్, మణిబాబు, తిమోతి, కన్నలిరమేష్, మార్టిన్‌బెంజిమన్, సిపిఎం నాయకులు అంగేరిపుల్లయ్య, జనవిజ్ఞానవేదిక సీనియర్ నాయకులు షరీఫ్‌లతో పాటు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా తయారీలో జాగ్రత్తగా వుండాలి

### గాలి భానుప్రకాశ్



సమావేశంలో మాట్లాడుతున్న భానుప్రకాశ్

పుత్తూరు, జూలై 30 ప్రభాతవార్త :

ఓటర్ల జాబితా రూపకల్పనలో తప్పులు జరగకుండా తెలుగుదేశం పార్టీకి చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు జాగ్రత్తలు తీసుకోవాలని టిడిపి నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ సూచించారు. రూరల్ మండల పరిధిలోని కెబిఆర్ పురంలో ఆదివారం జరిగిన బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఇంటింటి ఓటర్ వెరిఫికేషన్ జరుగుతున్నందున ఏజెంట్లు అధికారులు, సిబ్బందితో సమన్వయంతో వ్యవహరించి ఓటర్ల జాబితాలో అక్రమాలకు చోటు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహించకుండా తమ తమ ప్రాంతాల్లో జరిగే ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియలో టిడిపి ఏజెంట్లు పాల్గొనాలని కోరారు. సమావేశంలో టిడిపి చిత్తూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపిపి గంజి మాధవయ్య, నాయకులు మోహన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక స్పృహతో సేవా కార్యక్రమాలు

### ప్రజల అభిష్టం మేరకు భవిష్యత్తు నిర్ణయం : డాలర్స్ అధినేత దివాకర్ రెడ్డి





చంద్రగిరి, జూలై 30 ప్రభాతవార్త:

పోటెత్తిన అభిమాన జనసంద్రం నడుమ డాలర్స్ వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. స్థానిక పిఎన్ రోడ్డు కోట సమీపంలోని జాతీయ రహదారి వద్ద ఆదివారం తిరుపతి రూరల్ మండలం, పెరుమాళ్ పల్లికి చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థ డాలర్స్ అధినేత దివాకర్ రెడ్డి తన సంస్థ 10వ వార్షికోత్సవ వేడుకలను కస్టమర్లు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, ప్రజల నడుమ జ్యోతి ప్రజ్వలన గావించి, ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల నుండి పెద్దఎత్తున జనసందోహం విచ్చేశారు. తన పుట్టిన రోజును పురస్కరించుకుని శుక్రవారం రోజున పేద ధనిక తారతమ్యం లేకుండా రూ.12/-లు సబ్సిడీతో తొండవాడ, తిరుచానూరు వద్ద పెట్రోల్‌ను అందించించారు. తన జన్మదిన వేడుకలతో పాటు డాలర్స్ వార్షికోత్సవ వేడుకలకు వేలాధిగా తరలివచ్చిన అభిమానులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దశాబ్ద కాలంలో డాలర్స్ సంస్థను అంచెలంచెలుగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కస్టమర్లు అందించిన సహకారంతో తనకు లభించిన లాభాల నుండి ప్రజలకు ఎంతో కొంత సాయం చేయాలనే సామాజిక స్పృహతో ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. కస్టమర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తనీయక సంస్థ పురోగతి సాధిస్తున్నట్లు తెలిపారు. అయితే ఈ రోజున తాను చేయదలచిన ఈ కార్యక్రమానికి ఎన్నో అవరోధాలు, బెదిరింపులు వచ్చినప్పటికీ పట్టించుకోలేదన్నారు. సామాజిక సేవలు అందిస్తున్న తాను భవిష్యత్తులో ప్రజలు, అభిమానులు ఆశిస్తే రాజకీయంగా తగిన నిర్ణయం తీసుకుంటానన్నారు. ఇప్పటికే రాజకీయంగా తనకు పలు పార్టీల నుండి ఆహ్వానం అందుతున్నట్లు తెలిపారు. వార్షికోత్సవ వేడుకలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో జబర్దస్త్ టీమ్ ప్రదర్శించిన కామెడీ షో ఆహుతులను ఆకట్టుకుని అలరించింది.

## మన్‌కీ బాత్ వీక్షిస్తున్న బిజెపి నేతలు



ఆదివారం న్యూఢిల్లీనుండి ప్రధాని నరేంద్రమోదీ నిర్వహించిన మన్‌కీబాత్ కార్యక్రమాన్ని తిరుపతిలో వీక్షిస్తున్న బిజెపి నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్ , చంద్రబాబు, చంగారెడ్డి తదితరులు

ప్రభాతవార్త-తిరుపతి